## 7

*రూపాంతరపు జీవితం*

*క్రైస్తవులు జీవించే విధానంలో కన్పిస్తుంది*

# క్రైస్తవుని వ్యక్తిత్వం

## (కొలస్సయులకు 3:1-17)

నీ వ్యక్తిత్వ స్వభావ లక్షణాలూ నడతలు కలిసి ఒక ప్రత్యేకమైన కట్టుగా నిన్ను వ్యక్తిగా చేస్తున్నాయి. ఆ భావంలో, ప్రతి ఒక్కరి వ్యక్తిత్వము ఏకైకమైనదైయుంటుంది. ఏదియెలాగున్నా, కొందరికి సామాన్యమైన గుణలక్షణాలుంటాయి: దీన్ని బట్టి మనోతత్వ శాస్త్రవేత్తలు మనుష్యులను: ఏక్స్‌ట్రో వెర్‌టడ్, ఇన్‌ట్రో వర్‌టడ్, ఇంపల్‌సివ్, పాసీవ్, అబ్‌సెస్సివ్, కంపల్సివ్, వగైరాలుగా విభజించారు.

ఈలాటి వ్యక్తిత్వాలను వేరుచేయడం సాధ్యమే ఎందుకంటె ఈ మాటల్లో వర్ణించ బడినవారు సామాన్య గుణలక్షణాలు కలిగియుంటారు. క్రైస్తవుని వ్యక్తిత్వాన్ని కూడా వేరుగా చూడగలిగే అవకాశముంటుంది ఎందుకంటె క్రైస్తవులకు కొన్ని సహజ గుణలక్షణాలు వారి శీలానికి సంబంధించినవైయుంటాయి.

వ్యక్తిత్వపు ప్రతి విషయంలోను క్రైస్తవులందరు ఒక్కటిగానే ఉంటారనేది లేక ఉండాలనేది చెప్పనుద్దేషించలేదనుకో. క్రైస్తవులలో పొడవు, పొట్టి, పెద్ద చిన్న ఎలాగుంటారో, అలాగే ఎక్స్‌ట్రోవర్‌టడ్ లేక ఇన్‌ట్రోవర్‌టడ్, లేదా ఇంపల్‌సీవ్ లేక పాసీవ్‌గా ఉండేవారుకూడా క్రైస్తవులైయుంటారు. ఏది కాకపోయినా నమ్మకమైన క్రైస్తవులవైపు నీవు చూచినట్టయితే, వారికి కొన్ని సహజమైన లక్షణాలు కామన్‌గా ఉంటాయి. అందులోవారు లోకంనుండి బహు వ్యత్యాసంగా ఉంటారు. వారికున్న ఆ సామాన్య గుణలక్షణాలను మనం "క్రైస్తవ వ్యక్తిత్వమని" పిలుస్తాం. ఆలాటి వ్యక్తిత్వం ఎలా ఉంటుంది, మరియు దాన్ని ఎలా పెంపార జేసికోగలుగుతాము? మూడు అంచలు గల విధానాన్ని వర్ణించడంవలన కొలస్సయులకు 3:1-17 ఈ ప్రశ్నలకు జవాబులిస్తుంది.

### మొదటి మెట్టు: మన జీవితాలను మార్చుకొనడానికి ప్రాథమిక ఉద్దేశంక్రీస్తుతో మనకున్న నూతన సంబంధం (కొలస్సయులకు 3:1-4)

తప్పుడు ఉపదేశకులచే ప్రభావితం చేయబడే అపాయంలో కొలస్సయులున్నారు. "... ఈ లోకసంబంధమైన మూలపాఠములను అనుసరించి మోసకరమైన నిరర్థక తత్వ జ్ఞానముచేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి" (కొలస్సయులకు

2:8). ఈ ఉపదేశకులు విగ్రహ సంబంధమైన తత్వశాస్త్రాన్ని (కొలస్సయులకు 2:8) యూదా మతతత్వంతో కలిపి ఉపదేశిస్తున్నట్టున్నారు (కొలస్సయులకు 2:16, 17). ఏదియెలాగున్నా, పాపపు సమస్యకు, వారు పరిష్కారంగా యివ్వగలిగినదంతయు లోకసంబంధమైన విధులు మాత్రమే. అబద్ధ బోధకుల నియమములను అంగీకరించ డానికి వ్యతిరేకించేలా కొలస్సయులను హెచ్చరించుతున్నాడు: "చేత పట్టుకొనవద్దు, రుచి చూడవద్దు, ముట్టవద్దు" అనేవి వారి విధులైయున్నాయి. "ఇవి మనుష్యుల ఆజ్ఞలు పద్ధతులను అనుసరించినవి" (కొలస్సయులకు 2:20–22). వారు క్రైస్తవులు కాకముందు లోకసంబంధమైన వాంఛలను వశపరచుకొనడానికి వారు ఈలాటి విధులను అనుసరించినట్టున్నారు.

ఈ విధులు ప్రయోజనకరమైనవి కావు. స్వయంగా చేయబడిన మతంలోను తన్నుతాను హీనపరచుకొనడం దేహాన్ని కఠినంగా బాధించడం జ్ఞానంగా కనబడ వచ్చునుగాని అవి ప్రయోజనకరమైనవికావు. "అట్టివి స్వేచ్ఛారాధన విషయములోను, వినయ విషయములోను దేహశిక్ష విషయములోను జ్ఞానరూపకమైనవని యెంచబడు చున్నవేగాని, శరీరేచ్ఛా విగ్రహ విషయములో ఏమాత్రము ఎన్నిక చేయదగినవి కావు" (కొలస్సయులకు 2:20–23). విధులు కట్టడలు పాపముచేయకుండ ఎన్నడే అరికట్టలేవు. మరి ఏది చేస్తుంది? పాపం చేయకుండ ప్రభావితంగా అడ్డుకొనేలా ఏది పని చేస్తుంది?

ఈ ప్రశ్నకు పౌలు కొలస్సయులకు 3:1–4లో జవాబిస్తున్నాడు: క్రీస్తుతో మనకున్న సంబంధమును గూర్చిన జ్ఞానము పాపంచేయకుండ మనలను ఆపుతోంది. పౌలు యిలా అంటున్నాడు: (1) మనము క్రీస్తుతో కూడ లేపబడ్డాం, గనుక, మనం పైనున్న వాటిని వెదకాలి (1 వచనం). (2) మనం మృతిచెంది మన జీవము క్రీస్తుతోకూడ దేవునియందు దాచబడినందున, పైనున్నవాటిమీద మనం మనస్సు పెట్టుకోవలసినవారమైయున్నాం (2, 3 వచనాలు). (3) క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మనకు బహుమానముంటుంది, అప్పుడు మనము ఆయనతో కూడ మహిమలో ప్రత్యక్షమౌతాం (4 వచనం). గనుక, మన జీవితాల్లో భూసంబంధమైనవాటిని చంపివేయవలసినవారమై యున్నాం (5 వచనం).

పౌలు అప్పీల్ చేసే ఉద్దేశం తేటగా ఉంది: మనం క్రీస్తుతో సంబంధం కలిగియున్నందున, మనం పైనున్నవాటిని వెదకుతాం. పైనున్నవాటిమీద మన మనస్సులు పెడతాం. లోకసంబంధమైన వాటిని చంపుతాం.

క్రీస్తుతో మనకుగల సంబంధం మనలను మార్పుచెందేలా ఎలా నడిపిస్తుంది? పలువిషయాలు జ్ఞాపకం వస్తున్నాయి: (1) మనం క్రైస్తవులమైనప్పుడు క్రీస్తు మనకు సమస్తంలో ప్రాముఖ్యమైయుంటారు. ఆయన కొరకైన మన ప్రేమ లోకాన్ని తక్కువగా ప్రేమించేలా చేస్తుంది. (2) శోధనను జయించునట్టుగా క్రీస్తు మనలను బలపరచుతారు. (3) క్రీస్తునందు దేవుడు మనలను క్షమించాడన్న వాస్తవం రక్షింపబడిన స్థితిలో నిలిచేలా/మనలను చేస్తుంది మరియు పాపాన్ని ప్రతిఘటించేలా ప్రోత్సహిస్తుంది. (4) మనము క్రైస్తవులమైనందున లోకంలో ఉన్నవారిలా జీవించడం మనకు తగదని కేవలం మనకు తెలుస్తుంది. (5) ప్రభువుకు సర్వాధికారమున్నందున, మనం ఆయన

మాటలనాలకించి ఆయనకు లోబడతాం. ఆయన బోధను అనుసరించుటవలన మనం పాపాన్ని జయించి, క్రైస్తవ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటాం.

ఈ మొదటి మెట్టును తీసికోనందున క్రైస్తవ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొనడంలో మనం విజయం సాధించియుండలేక పోవచ్చు. మనం తప్పుడు ఉద్దేశాలమీద ఆధారపడి యుండవచ్చు. నరకాన్ని తప్పించుకోవాలనే ప్రేరేపణ కలిగినవారమై, నరకం నుండి బయటపడాలంటే క్రొత్త నిబంధనలోని అనేక విధులకు కట్టడలను సంబంధించిన ఉపదేశాన్ని చూస్తాం. క్రైస్తవ్యానికి ఆలాటి దృక్పథం "స్వేచ్ఛారాధన విషయములను, వినయ విషయములోను దేహశిక్ష విషయములోను జ్ఞానరూపకమైన"దిగా ఎంచబడుతుంది (కొలస్సయులకు 2:20–23). అయితే కడకు, పౌలు చెప్పినట్టే "శరీరేచ్ఛా విగ్రహము విషయములలో ఏ మాత్రమును ఎన్నిక చేయదగినవి కావు." మన క్రైస్తవ జీవితం జీవించడానికి గాను మనం క్రీస్తుతో మన సహవాస సంబంధాన్ని బహు అల్పంగాను, లోక సంబంధమైన విధులను బహు దీర్ఘంగాను మనం ఆధారపడియుండవచ్చు.

## రెండవ మెట్టు: లోక సంబంధమైన స్వభావాన్ని చంపివేయి (కొలస్సయులకు 3:5-11)

లోక సంబంధమైన లక్షణాలను "చంపివేయమని" పౌలు అంటున్నది గమనించు (5 వచనం). "వీటినన్నిటిని మనం విసర్జించాలి" (8 వచనం), మరియు మనము "ప్రాచీన స్వభావమును దాని క్రియలతోకూడా పరిత్యజించాలి" (9 వచనం). మనం పాప సంబంధమైన గుణగణాలను "చంపివేయాలి," "విసర్జించాలి," "పరిత్యజించాలి." లోక సంబంధమైన స్వభావ లక్షణాలతో కలిసి జీవించుదామని తలంచకు! వాటిని విసర్జించు, చంపివేయి, చత్త బుట్టలో వాటిని పడవేయి, నీ జీవితం నుండి వాటిని తొలగించుకో నీ శీలంనుండి వాటిని తుడిచివేయి!

మనం చంపివేయవలసిందేమి?

### కామేచ్ఛకు సంబంధించిన పాపములను లయపరచు

"భూమీమీదనున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను కామాతురతను, దురాశను ... చంపివేయుడి" (కొలస్సయులకు 3:5). "అవినీతి" "జారత్వమని" (NEB) మరియు "లైంగిక అవినీతి" (Phillips) అని తర్జుమా చేయ బడింది. "అపవిత్రతను" "శుభ్రంలేని," "మలినమైన మనస్సు" (Phillips), లేక "మర్యాదలేమి" (NEB) అని తర్జుమా చేయబడింది. "కామాతురత" అనేది యితర తర్జుమాలలో "మితిమీరిన మమకారం" (KJV), "స్వాధీనంలేని వాంఛ" (Philllips) "లైంగిక వాంఛ" (NEB) తర్జుమా చేయబడింది. "దురాశ"? అనేది "కామవికారము" మరియు "చెడు వాంఛ" అని కూడా తర్జుమా చేయబడింది.

"జారత్వము," "అపవిత్రత," "కామాతురత," "దురాశ" అనే మాటలను వింటుంటే మనస్సుకు ఏమి తట్టుతంది? మన నవయుగం గూర్చి ఆలోచింపలేకయున్నాను. సోప్ అపేరావంటి టెలివిజన్ ప్రోగ్రాంలో "జారత్వము," "అపవిత్రత," "కామాతురత," "దురాశ"

లేకుండ ఎలాగుంటుంది? ఇవి లోకపు గుణగణాలైనా, అవి క్రైస్తవుని సూచించవు!

జారత్వమనే కార్యాన్ని మాత్రమే ఈ లేఖన భాగం విరోధించడంలేదు, కామాతురత అనే పాపాన్ని కూడా అది జరుగ నమ్మతించదు. క్రైస్తవుడు కామాతురతగలవాడై యుండ రాదు! పైగా, అతడు లేక ఆమె కామాతురతను కలిగించే పరిస్థితినుండి తప్పుకోవాలి, లేక యితరులు కామాతురతకు రేపబడేలా చేసేవాటినుండికూడా తప్పుకోవాలి. అనైతికమని భావించబడెడు చర్యను కలిగించే కార్యకలాపాలను, కామాతురతను సంబంధం కలిగియన్నవాటినుండి తొలిగిపోవాలి, మర్యాదయైన వస్త్రధారణ కలిగి యుండాలి.

అవినీతి కార్యాలను కామపు తలంపులనుండి ఎందుకు తొలిగిపోవాలి? "వాటివలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదికి వచ్చును" (కొలస్సయులకు 3:6). ఈలాటి పాపాలనుండి మనం కొంతసేపు తొలిగిపోవచ్చును, కాని క్రీస్తు వచ్చినప్పుడు, దేవుడు లెక్కలు తేల్చేస్తాడు. లౌకికాన్ని విత్తినవారు దేవుని ఉగ్రతను కోస్తారు!

### దురాశయను పాపాన్ని తీసివేసికో

పౌలు యిలా అంటున్నాడు: "... విగ్రహారాధనయను ధనాపేక్షను చంపివేయుడి" (కొలస్సయులకు 3:5). "ఇతరుల వస్తువులకొరకైన వాంఛ" అని Philllips తర్జుమా చేస్తుంది. మరల, మన ప్రపంచంలో యిది ప్రత్యేకంగా కావలసిన హెచ్చరికయైయుంది. తరుచుగా, నవీన వర్తకానికి వెనుక ఉన్న శక్తి దురాశ లేక పేరాశ.

ధనాపేక్షను విగ్రహారాధనగా పౌలు మాట్లాడడం ముచ్చటగా ఉంది. నవీన అమెరికాలో విగ్రహారాధనకు ఎక్కువ బహిరంగమైన ప్రాధాన్యత లేదు. కర్రతోగాని రాతితోగాని చేసిన విగ్రహాల ఎదుట మ్రొక్కే అలవాటు ప్రజలకు లేదు. అయితే ధనాపేక్షయనే విగ్రహారాధన బహు ఎక్కువగా ఉంది. దేవునికంటె ఎక్కువగా భౌతిక సొత్తును ముందు ఉంచుకునేవారు ఉన్నారు. ఈ సొత్తే వారికి దేవుడైయుంటుంది. అది ధనాపేక్ష ... అది విగ్రహారాధన ... అది పాపము ... అది దేవుని ఉగ్రతను మనమీదికి తెస్తుంది!

### కోపమనే పాపాన్ని విసర్జించండి

"ఇప్పుడైతే మీరు, కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ ... అను వాటినన్నిటిని విసర్జించుడి" (కొలస్సయులకు 3:8). మనము కోపాన్ని విసర్జించాలి; ఇది evil temper అని కూడా తర్జుమా చేయబడింది. కోపపడడం ఎల్లవేళ్లలా తప్పుకాదు (ఎఫెసీయులకు 4:26). కాని ఒకరకమైన కోపము తప్పు. ఏలాటి కోపమైన తప్పుచేయడానికి నడిపిస్తుంది! కోపాన్ని విసర్జించు! మనము ఆగ్రమును కూడా విసర్జించాలి అని పౌలు అంటున్నాడు. "ఎర్రి కోపం" అన్నట్టు తర్జుమా చేయబడింది (Philllips) "అవేశం" అని (NEB) అంది. దుష్టత్వాన్ని కూడా విసర్జించాలి. దీన్ని Philllips "చెడ్డ తలంపులు" అని తర్జుమా చేస్తుంది. మన కోపాన్ని మనం పోగొట్టుకొనడం మాత్రమేగాక, మనం పగలు పెట్టుకో కూడదు సరిగదా; మనకు కీడుచేసినవారికి విరోధంగా మన హృదయాల్లో అసూయను

ఉంచుకోకూడదు.

**నాలుక పాపాలను చంపివేయి**

"దూషణ, మీ నోట బూతులు అను వీటినన్నిటిని విసర్జించుడి" అని పౌలు అంటున్నాడు. "ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి" (కొలస్సయులకు 3:8, 9). దూషణను మనం విసర్జించాలి. ఇతర తర్జుమాల్లో అది "దూషణ," "దేవుని గూర్చిన చెడ్డ మాటలు" (Phillips), "శపించుట" (NEB); "నీ నోటనుండి చెడ్డ మాటలు" అనే దానిని "రోత సంభాషణ" Phillips తర్జుమా చేస్తే, "మురికి మాటలు"; మరియు "అబద్ధం" అని NEB తర్జుమా చేసింది.

క్రైస్తవుడు తన నాలుకను [కాచుకొన] స్వాధీనపరచుకొన ప్రయాసపడతాడు – ఏ రూపంలోనైనా తన పెదవులతో పాపం చేయడాన్ని మానుకుంటాడు – అది శపించడం వలననేగాని, లేక మురికి మాటలు వలననేగాని, లేక అబద్ధాలవలననేగాని. తన చుట్టునున్న జనులనుండి అది ఎంతగా అతని వేరుపరుస్తుందో!

క్రైస్తవుడు వీటన్నిటిని ఎందుకు విసర్జించాలి? ఎందుకంటె అలా జీవించడం మాట్లాడడం నూతన పరిస్థితిని అనుసరించే విధానం కాదు ఈ పాపాలను గూర్చి పౌలు యిలా అన్నాడు: "పూర్వము వారి మధ్య జీవించినప్పుడు మీరును వీటిని అనుసరించి నడుచుకొంటిరి" (7 వచనం). అయితే యిప్పుడు మీరు వాటినన్నిటి విసర్జించవలసి యుండును.

> ... ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి, జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృజించిన వాని పోలికచొప్పున నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొనియున్నారు ... భేదములేదు (కొలస్సయులకు 3:9–11).

నీ జీవితం మారింది! నీవు యిప్పుడు క్రైస్తవుడవు! అలాగే జీవించు! గతంలో, అన్ని విధములైన పాపముల విషయంలో దోషివైయుంటివి. అయితే నీవు యికమీదట ఆ విధంగా జీవించనేకూడదు! పైగా, "క్రీస్తే సర్వమును అందరిలో ఉన్నవాడునైయున్నాడు" గనుక యిప్పుడు నీ జీవితం లోకంచే గాక అయనచే ఏలుబడి చేయవలసియుంది!

## మూడవ మెట్టు: క్రైస్తవ గుణగణాలను ధరించుకో (కొలస్సయులకు 3:12-17)

కొలస్సయులకు 3:12–17లో ఉపయోగింపబడిన రూప చిత్రం బట్టలను మార్చుకొనడం. ఒకప్పుడు మన లక్షణములను తెలుపు స్వభావాన్ని చంపి, లోక సంబంధమైన గుణగణాలు తొలిగిపోయిన చోట, ఒకడు పాతవి తీసివేసి క్రొత్తబట్టలు ధరించుకొనునట్లు, క్రైస్తవ లక్షణాలను మనం ధరించుకోవలసియుంది.

క్రైస్తవుడుగా మారడమంటే, ఒక రాజ్యం నుండి మరొక రాజ్యానికి మార్చుకొనడమే అయ్యుంటుంది (కొలస్సయులకు 1:13, 14); అది క్రొత్తగా జన్మించినదానివంటిది

(యోహాను 3:3–5; 1 పేతురు 2:2); అది మృతులలోనుండి లేపబడినదానివంటిది (ఎఫెసీయులకు 2:1). అయితే అది దుస్తులు మార్చుకున్న దానివంటిది కూడా. "రక్షణ వస్త్రముతో" దేవుడు తన్ను కప్పినందుకు యెషయా ఆనందించాడు (యెషయా 61:10). తప్పిపోయిన కుమారుని రక్షణ ప్రశస్త వస్త్రము వానికి ధరింప చేసినదానికి గురుతుగా చెప్పబడింది (లూకా 15:22). వివాహపు విందును గూర్చిన ఉపమానంలో వస్త్రములు మార్చుకునే గురుతును ప్రభువైన యేసు వాడారు (మత్తయి 22:11–14). పరలోకంలో, రక్షింపబడినవారు తెల్లని వస్త్రం ధరింపజేయబడతారు (ప్రకటన7:13, 14). గలతీయులకు 3:27లో మనం యిలా చదువుతాం: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు." *"మీరందరు క్రీస్తును వస్త్రమువలె ధరించుకొనియున్నా"*రని NEB అంటుంది.

కొలస్సయులకు 3:1–3లో పౌలు క్రైస్తవ రూపాంతరాన్ని పునరుత్థానంతో పోల్చినా, అది వస్త్రాలను మార్చుకున్న దానికి పోలియుందని కూడా అతడన్నాడు:

> ... ప్రాచీన స్వభావమును దాని క్రియలతోకూడ మీరు పరిత్యజించి ... నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొనియున్నారు ... కాగా, దేవునిచేత ఏర్పరచబడినవారును పరిశుద్ధులును ప్రియులునైనవారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి (కొలస్సయులకు 3:9–12).

దీని ఉద్దేశమిది: నీవు ప్రాచీన జీవితం విషయంలో చనిపోయావు; నూతన జీవితానికి నీవు లేపబడ్డావు గనుక నీవు యిప్పుడు నూతన దుస్తులు ధరించవలసియుంటుంది – నీవు నీ వస్త్రాలను మార్చుకో – నీ నూతన అంతస్థుకు తగినట్టు దుస్తులను ధరించుకో.

మనం ధరించవలసిన నూతన వస్త్రాలనుగూర్చి ఆలోచించు:

### ఇతరులకొరకైన అక్కరను ధరించుకో

ఆ అక్కర రెండు పదాల్లో వ్యక్తపరచబడింది: మొదటిది, "జాలిగల మనస్సు" – ఈ గుణలక్షణం ఎల్లవేళ్లల క్రైస్తవుని సూచిస్తుంది! ఎల్లవేళ్లల క్రైస్తవుడు యితరులను గూర్చియు వారి అవసరతలను గూర్చియు అక్కర కలిగియుంటాడు. రెండవది, "దయాళుత్వము" క్రైస్తవుని సూచిస్తుంది! పొదునుగా ఉండడం, మనస్సును నొప్పించడం అనేది తెలివియని లోకం అనుకుంటుంది. త్వరగా తిప్పికొట్టడం, అవమానించడం, వారిని కుదుటపెట్టడంలో లోకం చాతుర్యాన్ని కనుపరచుతోంది. దానికి భిన్నంగా క్రైస్తవుడు, తాను కలిసికొన్న ప్రతివారి జీవితం తేలిక చేసేదానికి ఎల్లప్పుడు ప్రయత్నిస్తాడు.

### వినయాన్ని ధరించుకో

ఈ భావాన్ని రెండు పదాలు నొక్కి చెప్పుతాయి: అందులో మొదటిది, సాత్వికత్వము.

“మనస్సు యొక్క తగ్గింపు” అంటూ KJV అంటుంది; “అణుకువ” అని NEB అంటుంది. క్రైస్తవుడు “ఈకలు ధరించుకోడు.” తను పాపియని, కృప చేతనే రక్షింపబడ్డాడని అతడు గుర్తిస్తాడు, క్రీస్తులేకుండ అతడు ఏమిచేయలేడని అతనికి తెలుసు. తన జీవితంలో లక్ష్యం పరిచర్యచేయడమే గాని చేయించుకొనడం కాదు. రెండవది, “సాత్వికత్వం.” NEB దాన్ని “సాధుత్వం” అని తర్జుమా చేసింది. సాత్వికత్వం బలహీనతకాదు; అది అదుపులో ఉన్న బలం. ఇతరులతో సాధువుగా డీల్‌చేస్తూ సాత్వికత్వాన్ని క్రైస్తవుడు ప్రదర్శిస్తాడు.

## మనలను నిరాశపరచి గాయపరచినవారిపట్ల తగిన స్వభావం ధరించుకో

అనుకూలంకాని పరిస్థితులలో క్రైస్తవులు ఎలా స్పందించాలో మూడు పదాలు వర్ణించుతాయి. మొదట, *సహించడం* అనేది క్రైస్తవునిగా ఉండాలి. “దీర్ఘశాంతము” అని KJV తర్జుమాచేసింది. వ్యతిరేకతల్లో అతడు [సహించుతూ] భరించుతూ, తన భక్తిని కోల్పోకుండ సంగతలు కఠినమయ్యే సమయంలో ఉండాలి. రెండవది, *“ఓర్పు”* క్రైస్తవుని సూచిస్తుంది. పరిపూర్ణులుకాని వారిని సహించుతూ ఉండాలి. ఇతరులు బలహీనులు; వారు తప్పులు చేస్తారు; శీలంలో చిరాకు కలిగించే పనులు చేస్తారు. మనం ఏమి చేయాలి? వారు తప్పులు చేస్తున్నా, వారిని సహించుకొంటూ ప్రేమతో సాగిపోడానికి నేర్చుకోవాలి. మూడవది, *“క్షమించుట”* క్రైస్తవుడు క్షమించువాడైయుండాలి (కొలస్సయులకు 3:13). *సంఘంలో సహా* సభ్యులు ఒకరియెడల ఒకరు ఫిర్యాదు చేయువారుగా ఉండ వచ్చు. అప్పుడు ఏమిటి? ఒకని యొద్దకు యొకడు వెళ్లాలనే లేఖనాలు చెప్పుతున్న సంగతులను మరచిపోకుండా ఉండాలి, “దానిక్రింద” *ప్రాముఖ్యంగా క్షమించుట* ఉందని గ్రహించాలి!

## సమస్త మనుష్యుల యెడల ప్రేమను ధరించుకో

పౌలు యిలా అంటున్నాడు, “వీటన్నిటికి పైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకొనుడి” (కొలస్సయులకు 3:14). ప్రేమ నైతిక విషయమైయున్నది, అత్యధికంగా అవసరమైనది, మహిమోన్నతమైనది, క్రైస్తవ వ్యక్తిత్వపు ఏకైక సాధనమైయున్నది. ప్రేమ అతి పాాముఖ్యమైనది. ప్రేమ “ఐక్యతకు పరిపూర్ణ బంధమైయున్నది.” ఒకని వ్యక్తిత్వంలో మిగిలిన గుణలక్షణాలన్ని తగిన భాగంతో నిలుపునది ప్రేమయైయున్నదని దీని అర్థం కావచ్చు. క్రైస్తవులు అన్యోన్యంగా మసులుకొనడానికి సాధ్యంచేసేది ప్రేమయని చెప్పవచ్చు.

## సంఘానికి క్షేమాభివృద్ధిని కలిగించే లక్షణాలను, ప్రవర్తనను ధరించుకో

దేవుని పిల్లలుగా మనం కలిసి జీవించడానికి మూడు గుణలక్షణాలు సూచించవచ్చు. *సమాధానము* క్రైస్తవ సమాజాన్ని సూచించవచ్చు (కొలస్సయులకు 3:15ఎ). సమాధానము క్రైస్తవ హృదయాన్ని ఏలుబడి చేస్తుండాలి. క్రైస్తవ వ్యక్తులు దేవునితో సమాధానంగా ఉన్నప్పుడు, వారు ఒకరితో నొకరు సమాధానంగా ఉంటారు.

పైగా, *కృతజ్ఞత కలిగియుండడం* క్రైస్తవ సమాజ లక్షణమైయుంటుంది (కొలస్సయులకు 3:15బి). వ్యక్తిగతంగా మనం కృతజ్ఞతగలవారమై యుంటాం. తాను ఆరాధించునప్పుడు, సంఘం సమూహిక కృతజ్ఞతలు తలుపవలసినవారమైయుంటాం. ఆరాధించుట క్రైస్తవ సమాజపు లక్షణమైయుండాలి (కొలస్సయులకు 3:16). క్రైస్తవులు మానక దేవుని ఆరాధిస్తారు. ప్రత్యేకించి, క్రైస్తవులు దేవుని స్తుతించేవారును కీర్తనయందు ఒకరినొకరు హెచ్చరించుకొనువారై యున్నారు.

## ముగింపు

మనం చెప్పినదాన్ని సంగ్రహం చేయడం ఎలా? క్రైస్తవ వ్యక్తిత్వాన్ని వర్ణించడానికి ప్రయత్నం చేద్దాం. ఒకని నీవు చూస్తే ఎల గుర్తుపట్టగలవు?

క్రీస్తుచే రక్షింపబడిన ఒకడున్నాడని ఊహించు. అతడు సంపూర్ణంగా ప్రభువునకు సమర్పించుకున్నవాడు. భూ సంబంధమైన వాటికి మారుగా ఆత్మ సంబంధమైనవి. అతని జీవితాన్ని ఏలుబడి చేస్తున్నాయ. క్రీస్తు తనకొరకు ఏమి చేశారో దీన్ని గూర్చి అతడు ఆలోచిస్తాడు. క్రీస్తు తన్ను ఎలా ఉండమని కోరారో అలా బ్రదకడమే వాని జీవిత లక్ష్యమైయుంటుంది. క్రీస్తులో మునిగిపోయినవాడుగా తన్నుతాను తలంచుకుంటాడు మరియు మహిమలో ఆయనతో ఉండే దినంకొరకు ఎదురు చూస్తూ వేగిరపడుతుంట ాడు.

ఈ మధ్యకాలంలో, లౌకికాన్ని విసర్జించడానికి తనకు చేతనైనదంతా జరిగిస్తాడు. అతడు క్రీస్తును పోలి ఉండడానికి ప్రయత్నిస్తాడు. అతడు కనికరముగలిగి, దయగా వినయముగా, సాత్వీకముగా, ఓర్పుగా, సహనముగా, క్షమించువాడుగా, ప్రేమించువాడుగా ఉంటాడు. తన అంతరంగములోను యితరులతోను సమాధానంగా ఉంటాడు. అతడు ఎల్లప్పుడు దేవుని స్తుతించుతాడు. క్లుప్తంగా చెప్పాలంటే, ఆ వ్యక్తి క్రైస్తవ వ్యక్తిత్వముగలవాడై, కొలస్సయులకు 3:17కు లోబడడానికి తన చాయశక్తుల ప్రయత్నిస్తాడు: “మరియు మాటచేతగాని క్రియచేతగాని మీరేమిచేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తము ఆయన పేరట చేయుడి.” నీవు దాన్ని జరిగించినట్టయితే, క్రైస్తవ వ్యక్తిత్వాన్ని సంపాదించడంలో విజయం సాధించినట్టే.